www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

| విజయవాడ సిటీ**

ఈట్ రైట్ స్టేషన్‌గా బెజవాడ

ఫైవ్‌స్టార్ రేటింగ్‌తో ధ్రువీకరించిన ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా

- పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహార విధానాలు పాటించినందుకే..
- పదేపదే ఫుడ్ సేఫ్టీ బృందం తనిఖీలు.. కౌన్సెలింగ్ ఫలితంగా..
- 85 శాతం కంటే ఎక్కువ మార్కులతో డివిజన్‌లో రెండోస్థానం
- ఆరు నెలల పూర్తి అధ్యయనం తర్వాత వెల్లడించిన అధికారులు

2లో



ఆపరేషన్ బుడమేరు సాధ్యమేనా

బుడమేరు.. అక్రమార్కులకు ఇదొక ఆదాయ వనరు. పరివాహక ప్రాంతాల పరిరక్షణను పక్కనపెట్టి ఏళ్ల తరబడి ఈ అక్రమార్కులు ఆడిన రాక్షస క్రీడలో ఈ ఏరు దాదాపు కుంచించుకుపోయింది. వందల ఎకరాల్లో బుడమేటి ప్రాంతంలో నిర్మాణాలు వెలిశాయి. చేపలు, రొయ్యల చెరువులు పుట్టుకొచ్చాయి. ఫలితంగా వరదల సమయంలో నివాస ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకువస్తోంది. ఇకపై అలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు బుడమేరు ప్రక్షాళనకు టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం శుభపరిణామమే. అయితే, ఈ ప్రక్షాళన సక్రమంగా జరుగుతుందా? లేదా? అనే విషయం మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా నిక్కచ్చిగా సాగితే బుడమేరుకు పూర్వవైభవంగా తీసుకురావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వందల ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు

- విచ్చలవిడిగా చేపలు, రొయ్యల చెరువుల తవ్వకాలు
- ఫ్యాక్టరీలు సహా భారీ భవనాల నిర్మాణం
- రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా ఉంటే ఓకే
- లేదంటే ప్రక్షాళన కత్తిమీద సామే..
- నేడు బెజవాడలో ఉన్నతస్థాయి సమావేశం

4లో



అరిపిరాల వద్ద చప్టా పక్కన జారిన బుడమేరు గట్టు

నేడు అమిత్‌షా రాక

బెజవాడలో రెండు రోజులు పటిష్ట బందోబస్తు

- రేపు కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఐఎం భవనాల ప్రారంభం
- హోటల్ నోవాటెల్ వద్ద ప్రత్యేక భద్రత
- సమన్వయంతో పనిచేయండి : సీపీ రాజశేఖరబాబు సమీక్ష

2లో



మరో రక్షణ గోడ

కృష్ణానదిలో సీతానగరంవైపు త్వరలో నిర్మాణం

- రైల్వేబ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిలోమీటర్లు
- జలవనరుల శాఖ ప్రతిపాదనకు మంత్రివర్గ ఆమోదం
- రూ.294.20 కోట్లతో అంచనాలు సిద్ధం



కనకదుర్గమ్మ వారధి వద్ద విజయవాడ వైపు నిర్మించిన రక్షణ గోడ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానది వరద ముంపును అరికట్టడానికి విజయవాడ వైపున రక్షణ గోడ మాదిరిగానే గుంటూరు జిల్లాలోని సీతానగరం, తాడేపల్లి వైపు కూడా రెండో రక్షణ గోడను నిర్మించనున్నారు. దీనికి మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. గత ఏడాది సెప్టెంబరు 1వ తేదీన కృష్ణానదికి భారీగా వరద వచ్చింది. సుమారు 11 లక్షల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజీని తాకింది. అయితే, విజయవాడ వైపు ఉన్న ప్రాంతాలపై పెద్దగా కృష్ణానది వరద ప్రభావం కనిపించలేదు. కానీ, సీతానగరం ఘాట్లపై నుంచి సిమెంట్ రహదారి పైకి నీరు చేరింది. కనకదుర్గ వారధికి అవతలి వైపున ఉన్న విజయవాడ క్లబ్ ప్రహరీని తాకింది. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న కరకట్టలు బలహీనపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీతానగరం వైపు రక్షణ గోడను నిర్మించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్యారేజీ దిగువన సీతానగరంలోని రైల్వేబ్రిడ్జి నుంచి వారధి వరకు 2.160 కిలోమీటర్ల మేర గోడను నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి రూ.294.20 కోట్ల వ్యయమవుతుందని అంచనాలు రూపొందించగా, మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రక్షణ ఫలితం ఇదీ..

కృష్ణానదికి వరదలు వచ్చిన ప్రతిసారీ నగరంలోని కొంత ప్రాంతం వరద ముంపు బారిన పడుతుండేది. చిన్నపాటి వరద వచ్చినా, లక్షల క్యూసెక్కుల నీరు బ్యారేజీ నుంచి దిగువకు వచ్చినా కృష్ణలంక, గీతానగర్‌కట్ట, రామలింగేశ్వరనగర్, బాలాజీనగర్ ప్రాంతాలు మునిగిపోయేవి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. రామలింగేశ్వరనగర్ శ్మశానవాటిక నుంచి గీతానగర్ కట్ట వరకు రక్షణ గోడను నిర్మించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గీతానగర్ కట్ట నుంచి పద్మావతి ఘాట్ వరకు ఉన్న పరివాహక ప్రాంతంలో ఈ గోడను నిర్మించింది. గత ఏడాది కృష్ణా, బుడమేరుకు వచ్చిన వరద కారణంగా నగరంలోని భవానీపురం, కొత్తపేట, పాలఫ్యాక్టరీ, అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, నున్న, కండ్రిక ప్రాంతాలు నీటమునిగాయి. కానీ, రక్షణ గోడ నిర్మించిన కొన్ని ప్రాంతాల్లోకి మాత్రమే వరద నీరు ప్రవహించింది. రామలింగేశ్వరనగర్ శ్మశానం నుంచి యనమలకుదురు వైపునకు రక్షణ గోడ లేకపోవడంతో అటువైపు నుంచి వరద నీరు ప్రవేశించి వీధుల్లోకి చేరింది. ఈ గోడ లేకపోయినట్టయితే ముంపు ప్రభావం భారీగా ఉండేది. ఇలా వరదలు వచ్చినప్పుడు విజయవాడ పరివాహక ప్రదేశానికి రక్షణ ఉన్నప్పటికీ గుంటూరు జిల్లాలోని సీతానగరం, తాడేపల్లి వైపున ఆ పరిస్థితి లేదు. దీంతో విజయవాడ వైపు నిర్మించినట్టుగానే సీతానగరం వైపు కూడా రక్షణ గోడను నిర్మించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. దీనికి మంత్రివర్గం ఆమోదం తెలపడంతో రెండో రక్షణ గోడ నిర్మాణానికి కొద్దినెలల్లో అడుగులు పడతాయని జలవనరుల శాఖ వర్గాలు తెలిపాయి.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు గందరగోళంగా మారాయి. డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లు యజమానులు తమకు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్లు పూర్తయ్యాయని, ఇక ధాన్యం కొనలేమని చెబుతున్నారు. డ్రయ్యర్ సౌకర్యం లేని మిల్లు యజమానులేమో తమకు ఇచ్చిన టార్గెట్ పూర్తయ్యేదశలో ఉందని, ప్రస్తుతం ధాన్యం కొనలేమంటున్నారు. ప్రైవేటుగా తక్కువ ధరకు విక్రయిస్తే కొంటామని చెబుతున్నారు. మిల్లర్లు పెడుతున్న ఈ ఇబ్బందుల కారణంగా బస్తాకు రూ.150 తక్కువగా రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



ధాన్యం కాటా వేస్తున్న రైతులు

టార్గెట్ ధాన్యం

జిల్లాలో గందరగోళంగా మారిన కొనుగోళ్లు

టార్గెట్లు పూర్తయ్యాయంటున్న మిల్లర్లు

- ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్ 5.50 లక్షల టన్నులు
- ఇప్పటివరకు కొన్నది 4.40 లక్షల టన్నులు
- కొనాల్సిన ధాన్యం 1.10 లక్షల టన్నులు
- ఇంకా రైతుల వద్ద ఉన్నది 5.10 లక్షల టన్నులు
- బహిరంగ మార్కెట్‌లో దక్కని మద్దతు ధర
- తక్కువ ధరకు కొని కాకినాడకు తరలింపు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరి సాగైంది. 13 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గత ఆగస్టులో కురిసిన భారీవర్షాలు, బుడమేరు వరదల కారణంగా వరిపైరు దెబ్బతినడంతో 9.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలను సవరించారు. ప్రభుత్వం ద్వారా జిల్లాలో కేవలం 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం తక్కువగా నిర్ణయించడంతో మిల్లర్లు అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే, మలివిడతలో ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచుతామని పౌరసరఫరాల శాఖ అధికారులు సూచనప్రాయంగా హామీ ఇచ్చారు. 5.50 లక్షల టన్నుల ధాన్యాన్ని జిల్లాలోని 147 మిల్లులకు, వాటి సామర్థ్యానికి అనుగుణంగా సర్దుబాటు చేశారు. ఈ ఏడాది వరికోతల సమయంలో సంభవించిన రెండు తుపాన్ల ప్రభావంతో వర్షాలు కురవడంతో రైతులు మిగతా 2లో..

టార్గెట్ పెంచుతారా?


చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ, గూడూరు, పామర్రు, ఉయ్యూరు, మచిలీపట్నం తదితర మండలాల్లో వరిపంట కుప్పలుగా వేసి ఉంది. మార్చిలో మినుముతీతతో పాటే రైతులు కుప్పనూర్పిళ్లు చేస్తారు. జిల్లాలో ఇంకా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనేందుకు అధికారులు ప్రభుత్వం నుంచి అనుమతులు తెస్తేనే మద్దతు ధరకు రైతులు ధాన్యం విక్రయించుకోగలుగుతారు. లేకుంటే మిల్లర్లు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాలి. ఈ నేపథ్యంలో అధికారులు ధాన్యం కొనుగోలుకు సంబంధించి టార్గెట్‌ను పెంచుతూ అనుమతులు తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపే బిల్లులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని, ఆన్‌లైన్‌లో ధాన్యం విక్రయిస్తే నగదుకు ఢోకా ఉండదని రైతులు చెబుతున్నారు. మిల్లర్లకు లేదా వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తే నగదు సక్రమంగా, సకాలంలో చేతికందుతుందా లేదా అనే అంశంపైనా రైతులు భయపడుతున్నారు.

దుర్గగుడిలో మార్పులు

ఉద్యోగుల విధుల్లో కీలక మార్పులు చేర్పులు

వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడిలో మెరుగైన పరిపాలనా సౌలభ్యం కోసం డిప్యూటీ ఈవో, ఏఈవో, పర్యవేక్షకుల విధుల్లో మార్పులు చేస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజుకు స్ట్రాంగ్‌రూమ్, జ్యూయెలరీ, ఎఫ్‌డీఆర్ రెన్యువల్స్, హుండీలు, లీజులు, లైసెన్స్‌దారుల వేలంపాటల పర్యవేక్షణ, వీఐపీ ప్రొటోకాల్, కొండ దిగువన, ఎగువన పారిశుధ్య పర్యవేక్షణ అప్పగించారు. ఏఈవో ఎం.దుర్గారావుకు భూములు, లీజులు, న్యాయవిభాగం, శివాలయం ఓవరాల్ ఇన్‌చార్జి, పండుగలు, దత్తత దేవాలయాల విధులను అప్పగించారు. పి.సుధారాణికి చీరలు, ఆడిట్, అకౌంట్స్, సరుకుల సెంటర్ స్టోర్, జనరల్ విధులు కేటాయించారు. జె.శ్రీనివాసమూర్తికి రెలిజియస్, నాన్ రెలిజియస్, ఎస్టాబ్లిష్‌మెంట్, అమ్మవారి మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్స్, ట్రస్ట్‌బోర్డు, ఎస్పీఎఫ్, హోంగార్డు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల విభాగాల పర్యవేక్షణ, అకామిడేషన్, కనకదుర్గ ప్రభ, కేశఖండన శాలలు, స్టేషనరీ, ఎంబీ ఫారమ్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ఆర్టీఐ యాక్ట్, ధర్మపథం బాధ్యత అప్పగించారు. ఎం.శ్రీనివాసరావుకు అకౌంట్స్, ఐటీ రిటర్న్స్, జీఎస్టీ రిటర్న్స్ స్క్రూటినీ, అన్నదానం విధులు అప్పగించారు. కె.శ్రీనివాసరావుకు శానిటేషన్, దత్తత దేవాలయాలు, ఉపాలయాలు, అకామిడేషన్, ఆర్టీఐ యాక్ట్ విధులు అప్పగించారు. పి.భాగ్యజ్యోతికి మెయిన్ స్టోర్స్, ఆడిట్, జనరల్, చీరల విభాగాలు, తాడి గుర్రాజుకు ప్రసాదం తయారీ, స్టేషనరీ, ఎండీ ఫారమ్ అప్పగించారు. వీఎన్ జగదీశ్ ప్రసాద్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్, వేదపాఠశాల, కొండ దిగువన కౌంటర్ల పర్యవేక్షణ అప్పగించారు. వి.నగేశ్‌కు కొండ దిగువన రిసెప్షన్, కృష్ణమ్మ హారతులు, సీహెచ్‌వీ నరసింహరాజుకు మెయిన్ టెంపుల్, పూజలు, ఫెస్టివల్స్, డీవీవీ సత్యనారాయణకు కౌంటర్ల పర్యవేక్షణ, టోల్‌గేట్, ల్యాండ్స్, లీజులు అప్పగించారు.

ఫీజు.. ఫ్లీజ్



వాహన కాలుష్య తనిఖీ ఫీజుల్లో కొరవడిన నియంత్రణ

ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఏజెన్సీలు

వాహన కాలుష్య తనిఖీ ఫీజులపై నియంత్రణ కొరవడింది. కొన్ని అధీకృత ఏజెన్సీలు అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. తప్పులను కప్పి పుచ్చుకోవటానికి కాలుష్య తనిఖీ పత్రాలను వాహన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో ఫిట్‌నెస్‌కు దరఖాస్తు చేసుకున్న వాహనాలకు సామర్థ్య పరీక్ష చేయటానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- ప్రశ్నిస్తున్నారని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ నిలుపుదల
- మాన్యువల్ సర్టిఫికెట్లతో సరిపెడుతున్న ఏజెన్సీలు
- వాహనాల ఫిట్‌నెస్ విషయంలో తీవ్ర ఇబ్బందులు
- మూడు దశాబ్దాల కిందటి చార్జీల వల్లే అనధికారిక వసూళ్లు
- ఫీజులను సవరించాలని ఏజెన్సీల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మూడున్నర దశాబ్దాల కిందట ఏర్పడిన మోటారు వాహనాల చట్టం మేరకే ఇప్పటికీ వాహన కాలుష్య తనిఖీ ఫీజులు ఉన్నాయి. అప్పట్లో ద్విచక్ర వాహనానికి రూ.15, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.25, అన్ని రకాల డీజిల్ వాహనాలకు రూ.30 చొప్పున కాలుష్య తనిఖీ ఫీజుగా నిర్ణయించారు. కానీ, ఈ ఫీజులను ఏజెన్సీలు వసూలు చేయట్లేదు. అర్ధసంవత్సరానికి రూ.150-రూ.200 వరకు, సంవత్సరానికి రూ.300-రూ.400 వరకు అనధికారికంగా వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై రవాణా కేటగిరీకి చెందిన వాహనదారుల నుంచి ఆర్టీఏకు ఎప్పుడూ ఫిర్యాదులు వచ్చేవి కావు. కానీ, రవాణాయేతర కేటగిరీకి సంబంధించి మాత్రం ఫిర్యాదులొస్తున్నాయి. కార్లు వినియోగించే వారు ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారు.

వాహన్ సైట్‌లో అప్‌లోడ్ చేయరు

వాహన కాలుష్యాన్ని తనిఖీ చేశాక ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను వాహన్ సైట్‌లోకి అప్‌లోడ్ చేస్తే వాస్తవంగా ఎంత ఫీజు ఉంటుందో వాహనదారుడికి తెలుస్తుంది. ఉదాహరణకు రూ.100 చెల్లించి వాహనానికి కాలుష్య తనిఖీ నిర్వహించాక ఏజెన్సీలు సదరు వాహనదారుడికి సర్టిఫికెట్‌ను ఇస్తారు. కానీ, వాస్తవ ఫీజు రూ.25లే. ఈ విషయం ఆ సర్టిఫికెట్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవరకు వాహనదారుడికి తెలియదు. రూ.25కు రూ.100 చెల్లించామని తెలుసుకుంటున్న వారు ఆర్టీఏకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ తర్వాత అధికారులు సదరు ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో పెడుతున్నారు. ఈ కారణంగా ఏజెన్సీలు వాహన్ సైట్‌లోకి అప్‌లోడ్ చేయకుండా కేవలం మాన్యువల్‌గా సర్టిఫికెట్లను ఇస్తున్నాయి. మాన్యువల్‌గా చేతికి ఇవ్వడం వల్ల వాహన్ సైట్‌లో అప్‌లోడ్ కావట్లేదు. ఫలితంగా కాలుష్య తనిఖీ ధ్రువీకరణ లేని వాహనాలుగానే కనిపిస్తున్నాయి. చాలాకాలంగా రవాణా శాఖ అధికారులు వాహన కాలుష్యంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించట్లేదు. ఏదైనా సందర్భంలో కాలుష్య తనిఖీ ధ్రువీకరణ పత్రం అడగడంతో వాహనదారులు మాన్యువల్ సర్టిఫికెట్‌ను చూపిస్తున్నారు.

ఫిట్‌నెస్ తంతాలు

వాహనాల ఫిట్‌నెస్ విషయంలోనే ఇబ్బంది తలెత్తుతోంది. వాహనాలకు ఫిట్‌నెస్ చేయించాలంటే కచ్చితంగా పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండి తీరాలి. అది కూడా మిగతా 2లో..

ధరలు సవరించాలి

వాహన కాలుష్య తనిఖీ వ్యవస్థలో పారదర్శకత లోపిస్తోంది. కొన్నిచోట్ల అధిక ధరలు వసూలు చేస్తున్నారు. దీనివల్ల వాహనదారులపై భారం పడుతోంది. ప్రభుత్వం ఎందుకో ఈ అంశంపై దృష్టి సారించట్లేదు. రేట్లను సవరించటం వల్ల వాహనదారులపై భారమేమీ పడదు. గిట్టుబాటు ధరలను నిర్ణయించటం వల్ల వాహనదారుల నుంచి జరుగుతున్న దోపిడీ తగ్గుతుంది. దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. మరికొన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు రూ.2 నుంచి రూ.3 ప్రభుత్వానికి చెల్లించేలా మార్పు చేశారు. రాష్ట్రంలో కోటిన్నర వాహనాలు ఉంటే, వాటికి తనిఖీల ద్వారా ప్రభుత్వానికి రూ.27 కోట్ల మేర ఆదాయం వస్తుంది. అటు వాహనదారులు దోపిడీకి గురికాకుండా, ఇబ్బందులు పడకుండా ఉండాలన్నా.. ఇటు అధిక ధరలు వసూలు చేయకుండా ఉండాలన్నా ధరలను నిర్ణయించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- వి.రమేశ్‌కుమార్, ఏపీఎస్‌పీటీసీఏ అధ్యక్షుడు



రైల్వేస్టేషన్ రద్దీ

సంక్రాంతి సెలవులు ముగియడంతో విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ తారస్థాయికి చేరింది. ప్లాట్‌ఫాంలన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. రైళ్లు కూడా కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి సెలవులకు సొంతూర్లకు వచ్చి.. తిరిగి వెళ్తున్న వారితో రైల్వేస్టేషన్ ప్రాంగణంతో పాటు టికెట్ కౌంటర్లు కళకళలాడుతున్నాయి. పండుగను పురస్కరించుకుని రైల్వే అధికారులు ప్రకటించిన ప్రత్యేక రైళ్లు కూడా సరిపోవట్లేదు. సాధారణ రైళ్లలో కూడా కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది.

ముగ్గురు డీఎస్పీల నియామకం

మచిలీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముగ్గురు డీఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గుడివాడ డీఎస్పీగా వి.ధీరజ్‌వినీల్, అవనిగడ్డ డీఎస్పీగా తాళ్లూరి విద్యశ్రీ, మచిలీపట్నం డీఎస్పీగా చప్పిడి రాజాను నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.



గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు

- ఈ-లాటరీలో 39 మంది రైతులకు 72 ప్లాట్ల కేటాయింపు

2లో

సర్వజనాస్పత్రిలో పరికరాలు ప్రారంభం

- కీలకమైన పరికరాల రాకతో సత్వర వైద్యసేవలు

నేడు నగరానికి అమిత్ షా రాక

● పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తాం: సీపీ రాజశేఖర్ బాబు

గుణదల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా నగర పర్యటనకు వస్తున్నందున శని, ఆదివారాల్లో నగరంలో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తామని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు తెలిపారు. అమిత్ షా రాకను పురస్కరించుకుని నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై అధికారులతో సీపీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమిత్‌షా శనివారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో దిగి అక్కడ నుంచి రోడ్డు మార్గాన విజయవాడ మీదుగా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పలువురు మంత్రులతో కలిసి భోజనం చేస్తారన్నారు. అక్కడ నుంచి తిరిగి నగరంలోని నోవోటెల్‌కు చేరుకుని అక్కడ రాత్రికి బసచేయనున్నట్లు తెలిపారు. నోవోటెల్ పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అమిత్ షా పర్యటనలో ఉన్న సమయంలో నగరంలోని ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఆదివారం ఉదయం ఆయన కృష్ణా జిల్లాలోని ఎన్డీఆర్‌ఎఫ్ వారి నిదం క్యాంపస్ ప్రారంభ కార్యక్రమానికి వెళతారని తెలిపారు. డీసీపీ గౌతమి షాలి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ప్రసాద్, సబ్ కలెక్టర్ చైతన్య, ఏడీసీపీలు ఎం.రాజారావు, ప్రసన్నకుమార్, ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల కట్టడికి
సమన్వయంతో పనిచేయండి

● వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణ, మాతా శిశు మరణాల కట్టడికి వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి పదేళ్ల నుంచి పంధొమ్మిదేళ్ల వయస్సులోపు బాలికలు, 49 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన మహిళలకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి రక్తహీనతను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన వారికి అవసరమైన ఐరన్ టాబ్లెట్లు, ఇంజక్షన్లు, పౌష్టికాహారం అందించి రక్తహీనతను నివారించేందుకు వైద్య మహిళా శిశు సంక్షేమ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులను గుర్తించి వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేయాలని సూచించారు. సాధ్యమైనంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తరచూ గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం తీసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొనేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపకుండా చూడాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అమలు చేయడంలో వైద్య ఆరోగ్య మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీసీహెచ్‌సీ డీసీకే నాయక్, ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు జి.మంగమ్మ, కె.నాగమణి, లక్ష్మీభార్గవి, భాగ్యరేణుక, సత్యవతి, పుష్పవతి, నోడల్ ఆఫీసర్ సాయిగీత, ప్రోగ్రాం ఆఫీసర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఈట్ రైట్ స్టేషన్‌గా విజయవాడ

ఫైవ్ స్టార్ రేటింగ్‌తో ధ్రువీకరించిన ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా




Vijayawada Railway Station
N T R, Andhra Pradesh
is certified as
Eat Right STATION
as per guideline established by
Food Safety and Standards Authority of India
for the period of 16 January, 2025 to 15 January, 2027
★★★★★
EXEMPLARY

'ఈట్ రైట్ స్టేషన్'సర్టిఫికెట్


ఆనందం వ్యక్తం చేస్తున్న రైల్వే ఉద్యోగులు

రైల్వేస్టేషన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహార విధానాలను అవలంబించినందుకు ఫుడ్‌సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు 'ఈట్ రైట్‌స్టేషన్' ధ్రువీకరణ లభించింది. అన్నవరం, గుంటూరు, నడికుడి, హైదరాబాద్‌లోని నాంపల్లి స్టేషన్ తర్వాత ఎస్‌ఈఆర్ జోన్‌లో ఐదో స్టేషన్‌గా, విజయవాడ డివిజన్‌లో రెండోదిగా విజయవాడ రైల్వేస్టేషన్‌గా నిలిచింది. 85 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి 5స్టార్ గుర్తింపు పొందింది. విజయవాడ నుంచి రోజూ లక్ష మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ నాణ్యమైన ఆహారాన్ని అందించటానికి ఫుడ్ సేఫ్టీ, ట్రైనింగ్ సర్టిఫికేషన్‌లో ఇక్కడి స్టాళ్ల యజమానులు, కేటరింగ్ విక్రేతలు ఆహారాన్ని రవాణా చేసేవారు శిక్షణ పొందారు. విజయవాడ రైల్వే హాస్పిటల్ చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శౌరిబాల ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ బృందం పలు పర్యాయాలు కౌన్సెలింగ్ నిర్వహించింది. ఆహార భద్రత, పరిశుభ్రత, ప్రమాణాలు, విక్రయదారుల వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ పరికరాలు, ఉత్పత్తుల గడువు తేదీలు, శీతోష్ణస్థితి, ఉష్ణోగ్రత విధానాలు, చెత్తను పారవేయడం, తడి, పొడి చెత్త విభజనపై నిరంతర పర్యవేక్షణ జరిగింది. ప్రారంభంలో ప్రీ ఆడిట్‌ను కూడా నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఎం ప్యానెల్ థర్డ్ పార్టీ ఆడిట్‌ను నిర్వహించింది. ఆరు నెలల పాటు పూర్తి పర్యవేక్షణ, అధ్యయనం తరువాత ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సర్టిఫికెట్ 2027 జనవరి వరకు అమలులో ఉంటుంది. సిబ్బందిని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, డాక్టర్ శౌరిబాల, వావిలపల్లి రాంబాబు, ఎండీ అలీఖాన్, ఎం.శైలజ, కె.అనిల్‌కుమార్, రహంతుల్లా అభినందించారు.

రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు

● ఈ-లాటరీలో 39 మంది రైతులకు 72 ప్లాట్లు కేటాయింపు


రాజధాని రైతులకు ప్లాట్ల పత్రాలు అందజేస్తున్న సీఆర్డీయే అధికారులు

వన్‌టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ స్కీం(ఎల్‌పీఎస్) కింద భూములు ఇచ్చిన రైతులకు సీఆర్డీయే కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని సీఆర్డీయే కార్యాలయంలో ఈ-లాటరీ నిర్వహించి ప్లాట్లను కేటాయించారు. రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. ఈ-లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించారో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించారు. అబ్బరాజుపాలెం, రాయపూడి 1 అండ్ 2, కొండమరాజుపాలెం, వెలగపూడి, మందడం 1 అండ్ 2, గ్రామాలకు సంబంధించిన 39 మంది రైతులకు 72 ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సౌకర్యవంతంగా జరిగేందుకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని రైతులకు తెలిపారు. ఈ ప్లాట్ల పంపిణీ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ, సీఆర్డీయే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.ఎస్.భాగ్యరేఖ, కె.స్వర్ణమేరి, ప్లానింగ్ విభాగ డైరెక్టర్ బి.సురేష్ కుమార్, తహసీల్దార్ అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

పండగ చేసుకున్నారు!

● పోలీసులకు బరికి రూ.30 వేల నుంచి రూ.3లక్షలు
● నిర్వాహకుల నుంచి వసూలు చేసి, మూడురోజులూ మిన్నకున్నారని ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి-నందివాడ): హైకోర్టు ఆదేశాల ప్రకారం సంక్రాంతి పండుగ మూడు రోజులు జూదాలు, కోడి పందేలు నిర్వహిస్తే శిక్షార్హులు అంటూ పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామాల్లో బ్యానర్లు ఏర్పాటు చేశారు. మైకుల ద్వారా నానా హడావిడి చేశారు. పోలీసులు గ్రామాల్లో నానా హడావిడి చేశారు. మండలంలో గోపాలపురం, పోలుకొండ, గండేపూడి, నందివాడ, పుట్టగుంట గ్రామాల్లో కోడి పందేలు బరులు నిర్వహించారు. ఈ ఏడాది కూడా పోలీసు అధికారులు బరి స్థాయిమేరకు నిర్వాహకుల నుంచి రూ.30 వేల నుంచి రూ.3 లక్షల వరకు ముక్కు పిండి వసూళ్లు చేశారని పందెపు రాయుళ్లు ప్రచారం చేస్తున్నారు. పండుగ మూడు రోజులు పందెం బరుల్లో పేకాట, కోడి పందేలు, గుండాట, చిత్తులాట, బిర్యానీ పాయింట్లు నిర్వహించినా పోలీసు అధికారులు వీరి వంక కన్నెత్తి చూడలేదు. బరుల్లో గొడవలు జరిగినా తమకేమీ తెలియదన్నట్లు పట్టించుకోలేదు. బరులు ఏర్పాటు చేసిన కొంతమంది కనీసం పోలీసులకు కట్టిన డబ్బులు కూడా రాలేదని నెత్తినోరు బాదుకుంటున్నారు.


స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్‌కు చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈఓ రత్నరాజు, అర్చకులు

కనకదుర్గమ్మను దర్శించుకున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

వన్‌టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్ దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఈవో రత్నరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వీరికి డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

విజయవాడకు చెందిన శ్రీనృత్య కళానిలయం నాట్యాచారిణి గోనుగుంట శైలశ్రీ ఆధ్వర్యంలోని కళాకారుల బృందం శుక్రవారం దుర్గగుడి కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. లావణ్య, కాత్యాయని, రాశ్యా, భావన, ఖ్యాతిక, గుణసహస్ర, రితిక, జష్విత, చంద్రవర్షిణి, తన్మయిలు నాట్య ప్రదర్శనలో పాల్గొని 11 కీర్తనలకు చక్కని హావభావాలతో తాళ, లయలకు అనుగుణంగా నాట్య ప్రదర్శన చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు.


ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు ఉమామహేశ్వరరావు

జలధీశ్వరస్వామి సేవలో అడ్వకేట్ జనరల్

ఘంటసాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, తన కుటుంబసభ్యులతో కలిసి బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. స్వామికి ఆలయ అర్చకుడు మొవ్వ ఉమామహేశ్వరరావు విశేష పూజలు చేశారు. ప్రసాదాన్ని, దేవాలయ చిత్రపటాన్ని, చరిత్ర పుస్తకాలను దమ్మాలపాటికి అందజేశారు.

ఆర్థిక సహాయం అందించండి

● ఎంపీ కేశినేని చిన్నికి పర్వతారోహకుడు చిన్నికృష్ణ వినతి

వన్‌టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తనకు గత ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని అనంతపురం జిల్లా పామిడి మండలం పాళ్యం తండాకు చెందిన పర్వతారోహకుడు రామావత్ చిన్నికృష్ణ కోరారు. శుక్రవారం ఎంపీని గురునానక్ కాలనీలోని కార్యాలయంలో ఆయన కలిశారు. గత ప్రభుత్వంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఎంపీకి వివరించారు. హిమాలయ పర్వత ప్రాంతంలో రేనాక్ పర్వతాన్ని జమ్మూకశ్మీర్‌లో బైసరన్ పర్వతాన్ని 2018లో దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని, రష్యాలో ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించానని చిన్నికి వివరించారు. హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, మల్టీ టాలెంటెడ్ స్పోర్ట్స్ పర్సన్ అవార్డ్ సాధించిన రామావత్‌ను ఎంపీ అభినందించారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సర్వజనాస్పత్రిలో వైద్య పరికరాలు ప్రారంభం


వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న డాక్టర్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ ఏవీ రావు

ప్రభుత్వాసుపత్రి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా సర్వజనాస్పత్రిలోని ఈఎన్‌టీ విభాగానికి అందిన ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోప్, హార్మోనిక్ స్కాల్‌పెల్, అడ్వాన్స్‌డ్ కాట్రీ, ఇంపిడెన్స్ ఆడియోమెట్రీ పరికరాలను ప్రొఫెసర్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు, హెచ్‌వోడీ డాక్టర్ కె.రవి శుక్రవారం ప్రారంభించారు. ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోప్‌తో స్వరపేటిక, గురక సమస్యలు, గొంతు క్యాన్సర్ నిర్ధారణ వేగంగా చేయొచ్చని డాక్టర్ కె.రవి తెలిపారు. హార్మోనిక్ స్కాల్‌పెల్‌తో త్వరిగతిన థైరాయిడ్ ఆపరేషన్లు, స్వరపేటిక కేన్సర్ ఆపరేషన్లు, మెడపై పెద్ద కణితలను తొలగించవచ్చన్నారు. డాక్టర్ ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ టాక్టర్ టి.లీలాప్రసాద్, డాక్టర్ పి.రత్నబాబు, డాక్టర్ జీబీ శ్రీనివాస్, డాక్టర్ పి.ఆదిత్య, డాక్టర్ పి.స్పందన పాల్గొన్నారు.

ఫీజు.. ప్లీజ్

(మొదటి పేజీ తరువాయి)

'వాహన్'లో అప్‌లోడై ఉండాలి. ఏజెన్సీలు మాన్యువల్‌గా సర్టిఫికెట్ ఇవ్వడం వల్ల వాహన్ సైట్‌లో అప్‌లోడ్ కావట్లేదు. దీంతో ఆ వాహనం ఫిట్‌నెస్ లేనిదిగానే చూపిస్తుంది. కాగా, దాదాపు 36 ఏళ్ల కిందట నిర్దేశించిన వాహన కాలుష్య తనిఖీ చార్జీల వల్ల ఏజెన్సీలకు నిర్వహణ ఖర్చు కూడా రావట్లేదు. దీంతో నిర్దేశించిన చార్జీల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో అధీకృత వాహన తనిఖీ కేంద్రాల సంఘం నుంచి రేట్లను సవరించాల్సిందిగా డిమాండ్ వస్తోంది. కొన్ని ఏజెన్సీలు చేస్తున్న తప్పుల వల్ల అందరిపై మచ్చపడుతోందని, గిట్టుబాటయ్యే విధంగా రేట్లను సవరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ఏజెన్సీలకు గిట్టుబాటు రేట్లను నిర్ధారించారని, ఇక్కడ కూడా అలాంటి చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తోంది.

టార్గెట్ ధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాల ద్వారా వరికోతలను పూర్తిచేశారు. డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులకు ఆన్‌లైన్‌లో ధాన్యాన్ని విక్రయించారు. ఇప్పటివరకు జిల్లాలో 4.40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కలననుసరించి, ముందస్తుగా నిర్ణయించిన లక్ష్యం ప్రకారం జిల్లాలో ఇంకా 1.10 లక్షల టన్నులకు మించి ధాన్యం కొనడానికి అవకాశం లేదనేది అధికారుల మాట. అయితే, 5.10 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనాల్సి ఉంది. ఈ ఏడాది బీపీటీ ధాన్యాన్ని కొనేందుకు హైదరాబాద్ వ్యాపారులు మన జిల్లాకు రాలేదు. దీంతో ఈరకం ధాన్యానికి మద్దతు ధర ప్రైవేట్‌గా పెరగలేదు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే బీపీటీ రకం ధాన్యాన్ని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీపీటీ రకంతో పాటు 1061, 1074, 1262, 1318 తదితర ముతక రకాల ధాన్యం ఇంకా జిల్లాలో 5 లక్షల టన్నులకు పైగా కుప్పలరూపంలో ఉంది. వీటిని కొనేందుకు ప్రభుత్వం అనుమతులు ఇస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కాకినాడకు బియ్యం ఎగుమతులు

జిల్లాలోని మిల్లులకు నిర్దేశించిన ధాన్యం టార్గెట్లు దాదాపు పూర్తికావడంతో మిల్లర్లు ఇదే అదనుగా ధరను తగ్గించి రైతుల వద్ద కొంటున్నారు. బస్తా ధాన్యానికి రూ.1,725ను మద్దతు ధరగా చెల్లించాల్సి ఉండగా, రూ.1,600 ఇస్తున్నారు. అదేమని రైతులు ప్రశ్నిస్తే ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం లేదని మిల్లర్లు చెబుతున్నారు.

'మీ వద్ద కొన్న ధాన్యాన్ని మరపట్టాక కాకినాడకు తరలిస్తే కిలో బియ్యానికి రూ.32 మేర ధర వస్తుంది. రవాణా, ధాన్యం మరపట్టడం, ఇతరత్రా ఖర్చులన్నీ లెక్కగడితే బస్తా ధాన్యాన్ని రూ.1,600కు మించి కొనుగోలు చేయలేం' అని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో రైతులు విధిలేని స్థితిలో మిల్లర్లు నిర్ణయించిన ధరకే విక్రయిస్తున్నారు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తే ధర రూపంలో రూ.4,500ను కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చీమలపాడులో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

ఎరువుల దుకాణాల్లో
ఆకస్మిక తనిఖీలు

తిరువూరు/ఎ.కొండూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారుల ఆదేశాల మేరకు అంతర్గత స్క్వాడ్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, ఏవో పద్మ ఎరువుల నిల్వలు, ఈ పాస్‌లో నిల్వలు పరిశీలించారు. ఎరువుల అమ్మకాలకు సోర్స్ సర్టిఫికెట్(ఓ ఫాం), బయో స్టిములెంట్ల సంబంధించిన పత్రాలు చూపని చీమలపాడు సాయి ఎంటర్‌ప్రైజస్ దుకాణంలో రూ.3.54 లక్షలు, ఎ.కొండూరులోని శ్రీలక్ష్మి గణపతి ఎంటర్‌ప్రైజస్‌లో రూ.1.48 లక్షలు, కంభంపాడులో శ్రీలక్ష్మీహనుమాన్ ట్రేడర్స్‌లో రూ.4.49 లక్షలు మొత్తం రూ.9.52 లక్షల ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. పత్రాలను నాలుగురోజుల్లో వ్యవసాయశాఖ కార్యాలయంలో అందించాలని, లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు అమ్మకాలు జరిపే ప్రతి డీలరు తప్పనిసరిగా, ఫిజికల్, ఈ-పోస్‌లో స్టాక్ తేడా లేకుండా చూసుకోవాలని, రోజూ అమ్మిన స్టాకు వివరాలు ఈ-పోస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎ.కొండూరు ఏవో టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

రూ.2.14 లక్షల విలువైన ఎరువుల విక్రయాలు నిలిపివేత

ఇబ్రహీంపట్నం: ఫారం ఓ గడువు ముగియడం, రిజిస్టర్ సరిగా పొందుపర్చకపోవడం, స్టాక్ సరైన వ్యవధిలో ఎక్‌నాలెడ్జ్‌మెంట్ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రూ.2.14 లక్షల విలువైన ఎరువుల విక్రయాలను నిలిపివేసినట్లు నందిగామ ఏడీఏ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పలు ఎరువులు, పురుగుమందు దుకాణాల్లో ఆయన తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో డి.శైలజ పాల్గొన్నారు.

రైతుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

● అధికారులకు సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశం

కృష్ణలంక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ డేలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులను సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు, రైతుకూలీలు నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ డేను రాజధాని ప్రాంత రైతులు వినియో గించుకోవాలని ఆయన సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు కె.స్వర్ణమేరి, పి.పద్మావతి, జి.రవీందర్, ఏజీ చిన్నికృష్ణ, బి.సాయి శ్రీనివాస్ నాయక్, సామాజిక అభివృద్ధి విభాగ డీసీడీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


తుళ్లూరులోని ప్రాంతీయ కార్యాలయంలో రాజధాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

ఈపీఎస్, ఓపీఎస్ ఆప్షన్ సమస్య పరిష్కరించండి

● ప్రజా రవాణా సంస్థ డిప్యూటీ సీపీఎం(ఏ) జయశంకర్‌కు పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వినతి

బస్‌స్టేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్, ఓపీఎస్ ఆప్షన్ సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ సీపీఎం(ఎ) జయశంకర్‌ను ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల నుంచి ఈపీఎస్, సీపీఎస్ ఆప్షన్ తీసుకున్నప్పటికీ ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవటంతో ఉద్యోగులు కష్టనష్టాలపై చర్చించేందుకు శుక్రవారం కేంద్ర కార్యాలయంలో జయశంకర్ సమక్షంలో అసోసియేషన్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు నష్టపోతున్నారని, రాతపూర్వకంగా విజ్ఞప్తి చేస్తూ సత్వర నిర్ణయం తీసుకోవాలని ఇంతకుముందే అసోసియేషన్ కోరిందని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి ఎస్.రాజేష్ కుమార్ పలు ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గవర్నమెంట్ పెన్షన్ స్కీమ్ విధానాలను తెలియజేసి, ఉద్యోగుల నుంచి ఈపీఎస్, సీపీఎస్ ఆప్షన్ ఎంచుకోవాలని నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఆప్షన్ ఓపెన్‌లో ఉంచాలని అప్పట్లో అసోసియేషన్ కోరిందని, అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం ఏ చర్య తీసుకోకపోవటం వల్ల సీపీఎస్‌కు ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదన్నారు. కూటమి ప్రభుత్వం రావటంతో సీపీఎస్‌పై ప్రభుత్వం అభిప్రాయమేమిటో ఇంతవరకు తెలియరాలేదన్నారు. ఈపీఎస్, సీపీఎస్‌కు ఎంతమంది ఆప్షన్ ఇచ్చారో వివరాలు ఇవ్వాలని కోరారు. వివరాలు వచ్చిన తరువాత ఏమి చేస్తామన్నది తెలియజేస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా నిర్ణయం వెలువడే విధంగా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అసోసియేషన్లను కూడా భాగస్వామ్యం చేస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగేళ్లుగా సీపీఎస్ ఆప్షన్ విషయంలో ప్రభుత్వ పరంగా ఆలస్యం అయినందున జీవో నెం.113లో కటాఫ్ డేట్ ఇవ్వనందున ఉద్యోగులకు నష్టం కలుగుతుందని, దీంతో మరొకసారి ఆప్షన్ తీసుకుని ఆనాటి నుంచి అర్హత వచ్చే వచ్చే విధంగా ప్రభుత్వం అనుమతి కొరకు లేఖ రాయాలని కోరారు. 7,500 మంది ఆప్షన్ ఇచ్చారని, మళ్లీ ఆప్షన్ ఇచ్చుకునేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి చివరి తేదీ అని డిప్యూటీ సీపీఎం(ఎ) బదులిచ్చారు. ఈ సమయం సరిపోదని, మరికొంత సమయం కావాలని నాయకులు కోరారు. ఈ అంశాన్ని ఎండీ దృష్టికి తీసుకువెళ్లి మిగిలిపోయిన ఉద్యోగులందరికీ కూడా ఆర్‌పీఎస్-2017 మేరకు బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

సిద్ధార్థ దంతవైద్య కళాశాలలో 20 నుంచి దంత వైద్యశిబిరం

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కట్టుడు పళ్ల విభాగం వారోత్సవాల సందర్భంగా గన్నవరం మండ లం, చినఅవుటపల్లి డాక్టర్ సుధా అండ్ నాగేశ్వర రావు సిద్ధార్థ దంతవైద్య కళాశాలలోని కట్టుడు పళ్ల విభా గం (రూమ్‌నెం-4)లో ఈ నెల 20నుంచి 31వతేదీ వరకు (12రోజులు) ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీ. రామోజీ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో తీసి పెట్టుకునే పూర్తి పళ్లసెట్లు, పాక్షిక పళ్ల సెట్లకు సంబం ధించిన సేవలు ఉచితంగా అందించబడతాయన్నారు. దంతాలు ఊడిపోయిన ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీరువా వితరణ

ఉయ్యూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్‌కు రిటైర్డ్ ఎన్డీఎస్ మాస్టారు, లక్కరాజు రామకోటేశ్వ రరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాయికిరణ్ ఇనుప బీరువాను శుక్రవారం అందజేశారు. అసోసి యేషన్ సభ్యుడైన రామకోటేశ్వరరావు ఇటీవల మృ తి చెందాడు. అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, పూర్ణ చంద్రరావు, బాపిరాజు, వెంకటేశ్వరరావు, కిషోర్, అంజనేయులు, సాయికిరణ్‌ను అభినందించారు.

అధికారుల నిర్లక్ష్యం!

- నిరుపయోగంగా గండిగుంట చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం
- షెడ్డులో ప్రైవేటు వ్యక్తుల ఎక్స్‌కవేటర్ల పార్కింగ్
- రూ.లక్షల ప్రభుత్వ సొమ్ము వృథా

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

లక్షల రూపాయల ప్రభుత్వ ధనంతో గండిగుం టలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ప్రైవేట్ వ్యక్తులకు ఎక్స్‌కవేటర్ల పార్కింగ్‌కు ఉపయో గపడుతుంది. గ్రామ పంచాయతీ పరిధి కాటూరు రోడ్డులో జాతీయ రహదారి పక్కన కొద్ది సంవత్సరాల క్రితం నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం అప్పటి నుంచి వినియోగించకుండా నిరుప యోగంగా ఉంచడంతో వాహనాలు, ఎక్స్‌కవేటర్ల, ట్రాక్టర్లు నిలుపుకునేందుకు ఉపయో గించుకుంటున్నారు. లక్షల రూపాయలతో జాతీయ రహదారి, ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన నిర్మించిన షెడ్డు ఉపయోగించకుండా సంవత్సరాల తరబడి వృథాగా ఉంచడం పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరిని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.



చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డులో ఎక్స్‌కవేటర్ల పార్కింగ్



2025 డైరీని ఆవిష్కరిస్తున్న విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి

2025 డైరీ ఆవిష్కరణ

పెనమలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సీనియర్ నాయకులు రెడ్డిపల్లి రాజు ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆవిష్కరించారు. శుక్రవారం తాడిగడపలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా మా ట్లాడుతూ, ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పార్టీ లకు కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరాం, కూటమి నేతలు మైలవరపు దుర్గారావు, కృష్ణ, పోతిన కంతేశ్వరుడు, దాడి అప్పారావు, దుర్వేసుల హాస్సేన్, బోగవల్లి శ్రీధర్, పై లా సురేష్, రౌతు రమ్యప్రియ తదితరులు పాల్గొన్నారు.



మురళీనగర్‌లో జరిగిన రాధారంగా ప్రభ మహోత్సవంలో నాయకులు

వైభవంగా రాధారంగా ప్రభ మహోత్సవం

పెనమలూరు, జనవరి17 (ఆంధ్రజ్యోతి): కానూరు మురళీనగర్‌లో శుక్ర వారం రాధారంగా ప్రభ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు కాట్రగడ్డ శ్రీను, భవానీల ఆధ్వర్యంలో ప్రభ బళ్లు, కోలాటం, కోయ నృత్యం, బేతాళ సెట్లు, డీజేలు తదితరాలతో కార్యక్రమం కన్నులపండువగా జరి గింది. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, చెన్నుపాటి శ్రీను, రాధ, రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు కొలనుకొండ శివాజీ, కొప్పుల వెంకట్రావు, సమ్మెల సత్యం, బాడిత శంకర్ తదితరులు పాల్గొన్నారు

చోరీ కేసులో నిందితుడికి జైలు

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పెయింట్స్ షాపులో చోరీకి పాల్ప డిన వ్యక్తికి గన్నవరం కోర్టు జైలు శిక్ష విధించింది. గన్నవరం గాంధీబొమ్మ సెం టర్లోని మాస్టర్ పెయింట్స్ షాపులో గత ఏడాది సెప్టెంబరు 14న దొంగతనం జరిగింది. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన గన్నవరం పోలీసులు కైకలూరు మండలం అటపాక గ్రామానికి చెందిన ఆరేపల్లి దుర్గారావు(38)ను నిందితుడిగా గుర్తించి, ఇటీవల గన్నవరం కోర్టులో హాజరుపర చగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. శుక్రవారం తదుపరి కేసు విచారణ చేపట్టిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడు నెలల కారా గారశిక్ష, రూ. 500 జరిమానా విధించారు.

20 నుంచి పశు వైద్యశిబిరాలు

కంకిపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి మాధవరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20న ప్రొద్దుటూరు, ఉప్పలూరు, 21న తెన్నేరు, దావులూరు, 22న కంద లంపాడు, వేల్పూరు, 23న నెప్పల్లి, గొడవర్రు, 24 న మారేడుమాక, మంతెన, 25న కోలవెన్ను, గొల్లగూడెం, 27న జగన్నాథపురం, పునాదిపాడు, 28న కాసరనేనివారి పాలెం, చలివేంద్రపాలెం, 29న కుందేరు, 30న కంకిపాడు, మద్దూరు, 31న ఈడుపు గల్లు గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పశువైద్య శిబిరాలను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

సీపీఎం నాయకుడు జోజికి ఘన నివాళి

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తేలప్రోలు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు కామ్రేడ్ జంపన జోజి (74) మృతిపట్ల ఆ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పార్టీజెండా కప్పి ఘన నివాళులర్పించారు. ఈ నెల 11న గ్రామంలో జరిగిన రోడ్డుప్ర మాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శుక్రవారం సీపీఎం నాయకులు కళ్లం వెం కటేశ్వరరావు, అజ్మీర్ వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, బేతా శ్రీనివా సరావు, మాగంటి సాంబశివరావు, పులి శ్రీనివాసరావు, చౌటుపల్లి జోజి, ప్రభాకర్ రావు, జ్యోతి తదితరులు జోజి అంతిమయాత్రలో పాల్గొని జోహార్లర్పించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు

అతివేగంతోనే ప్రమాదాలు

విజయవాడ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఎం కృష్ణమూర్తినాయుడు

పెనమలూరు, జనవరి17 (ఆంధ్రజ్యోతి) : పరిమితి మించిన వేగంతో వాహ నాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని విజయవాడ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఎం కృష్ణమూర్తినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలపై స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓరియంటేష న్ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కేంద్రయువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం విజయవాడ, ఎన్టీఆర్ ట్రాఫిక్ కమిషన రేట్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, డ్రైవింగ్ చేసేప్పుడు మనసు, శరీరం ఒకేవిధంగా పనిచేయాలని, వాహ నదారులు ఇతర ఆలోచనలతో అతివేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ, నెహ్రూ యువజన కేంద్రం అనేది దేశంలోనే అతిపెద్ద యూత్ నెట్వర్క్‌ను కలిగి ఉందని, అందుకే భారత రవాణా, రహదారుల శాఖ తమకు ఈ బాధ్యత అప్పగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంవీఐలు రామకృష్ణగౌడ్, ఉదయ శివప్రసాద్, లీగల్ ఏజెన్సీ ప్రతినిధులు త్రిమూర్తులు, ప్రో వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్, పెనమలూరు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

తాడిగడపలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పెనమలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దివంగత సీఎం, నటసార్వ భౌమ స్వర్గీయ ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా తాడిగడప సెంటర్‌లో శనివారం ఉదయం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆవిష్కరించను న్నట్లు టీడీపీ కార్యాలయ బాధ్యులు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం తొమ్మిదిన్నరకు పోరంకి టీడీపీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహి ంచనున్నట్లు తెలిపారు. తెలుగు జాతి ఆత్మగౌరవం అన్న ఎన్టీఆర్ సేవా స్ఫూర్తి ని కొనసాగిస్తూ ప్రతి టీడీపీ నాయకుడూ, కార్యకర్త వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కంకిపాడు : దివంగత సీఎం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా కంకిపాడు లో ఉచిత కంటి వైద్యశిబిరం శనివారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, దివంగత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కంకిపాడు విజయలక్ష్మి థియేటర్ సమీపంలో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, చలవాది రాజా, షేక్ బాజి, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ కల్యాణ వేదికకు రూ1.50 లక్షల విరాళం

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవ రంలోని లక్ష్మీతిరుపతమ్మ కల్యాణవే దిక నిర్మాణానికి తమ వంతు ఆర్థికసాయం అందించేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమని ఆలయ కమిటీ చైర్మన్ జాస్తి శ్రీధర్ అన్నారు. శుక్ర వారం గన్నవరానికి చెందిన కాస న్నేని రంగబాబు పద్మప్రియ దంప తులు వారి తల్లిదండ్రులైన కాస న్నేని వెంకటరత్నం, కృష్ణకుమారి జ్ఞాపకార్థం రూ.50వేలు, తాత,బామ్మలైన శేషావతారం, శేషాచలమ్మ జ్ఞాపకార్థం మరో రూ.50వేలు కలిపి మొత్తం రూ.లక్షరూపాయల నగదును విరాళంగా అందజేశారు. అదేవిధం గా కాసన్నేని రాధాకృష్ణ జ్ఞాపకార్థం వారి కుమార్తెలైన దేవిశ్రీ, శ్రీవినీల రూ.50వేల చెక్కును ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు



ఎంపికైన విద్యార్థులను, పీడీని అభినందిస్తున్న సర్పంచ్ లక్ష్మీమౌనిక, టీడీపీ నాయకుడు పొట్లూరి బసవారావు

కేసరపల్లి విద్యార్థులకు అభినందన

ఉంగుటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు కేసరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బి.అశ్విన్‌బాబు, పి.శ్రావణల క్ష్మీ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తోట నరేష్ తెలిపారు. అమ రావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నవంబర్‌లో జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 19 నుంచి 22వరకు ఛత్తీస్‌ఘర్ రాష్ట్రం దల్లిరాజ్‌హరలో జరిగే జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటనున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులకు, శిక్షణ ఇచ్చిన పీడీ ఎన్.శ్రీదేవిని హెచ్‌ఎంతోపాటు, గ్రామసర్పంచ్ లక్ష్మీమౌనిక, టీడీపీ నాయకులు పొట్లూరి బసవారావు, రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నుపాటి మహేష్, దొడ్డా దినేష్‌లు అభినందించారు.

ముప్పా రాజా సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

కంకిపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ముప్పా రాజా సస్పెన్షన్‌ను ఆ పార్టీ అధిష్టానం పునఃసమీక్షించుకోవాలని కంకి పాడు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) చైర్మన్ బోయిన రోహిణి కుమారి అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యా లయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కోడి పందేలు బరులు నిర్వహించారంటూ, బరులు వద్ద జనసేన పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారం టూ ఆయనను సస్పెండ్ చేయడం ఎంత వరకు సమంజసమ న్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు పార్టీ బలోపేతా నికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ సమావేశంలో నియోజవకర్గ జనసేన పార్టీ నాయకులు, వివిధ గ్రామాల జనసేన పార్టీ అధ్యక్షులు మేకల స్వాతి, సుంకర శివ, దొప్పలపూడి రంజిత్, నాగరాజు, లేళ్ల అయ్యప్ప, మొవ్వ సుబ్రహ్మణ్యం, నరహరశెట్టి పవన్, మేకా సుబ్బారావు, సయ్యద్ బాషా, బోసు, మురళి, మట్ట గోపి, కొండపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు, చోడవరంలో పొలం పిలుస్తోంది

పెనమలూరు, జనవరి17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనమ లూరు, చోడవరం గ్రామాల్లో శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లోని మొక్క జొన్నలో వచ్చు పురుగు, తెగుళ్ల గురించి రైతులతో చర్చించారు. మినప పంటలో, మొక్కజొన్నలో రైతులు వాడుతున్న ఎరువులు, కలుపుమందుల గురించి రైతులకు మండల వ్యవసాయాధికారిణి శైలజ సూచినలిచ్చారు.

కానుమోలులో నేత్రదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కానుమోలుకు చెందిన సుంకర భాస్కరరావు(84) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుమారుడు సుంకర సాంబశివ రాయల్, కుమార్తె పద్మలు నేత్రాలను దానం చేసేం దుకు ముందుకు వచ్చారు. దీంతో విజయవాడ ఎల్ వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు సమాచారం అందిం చారు. భాస్కరరావు కార్నియాను సిబ్బంది సేకరించా రు. కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు.



కార్నియాను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

ఆపరేషన్ బుడమేరు!

- నేడు ప్రక్షాళనపై ఉన్నత స్థాయి సమావేశం
- వందలాది ఎకరాల్లో ఆక్రమణలు
- అధికార దర్పంతో అడ్డగోలుగా చెరువుల తవ్వకాలు
- అధికారులకు తలనొప్పిగా రాజకీయ ఒత్తిడులు


బుడమేరు గట్టుపై పామాయిల్ తోట

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

విజయవాడలో బుడమేరు పిల్లకాలువను తలపిస్తుంది. దీనికి ప్రధాన కారణం బుడమేరులో లెక్కకు మించి ఉన్న ఆక్రమణలు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించి నీరు సాఫీగా కొల్లేరులో కలిసేలా చర్యలకు ఉపక్రమించింది. దీని కోసం ఇప్పటికే పలుమార్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. శనివారం విజయవాడలో బుడమేరు ప్రక్షాళన, ఆక్రమణల తొలగింపు అంశాలతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు.

● బుడమేరులో ఆక్రమణలు..

విజయవాడ నగరంలో బుడమేరు ప్రవహించే ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఆక్రమణలున్నాయి. కృష్ణాజిల్లా పరిధిలో


బుడమేరు గట్టును తవ్వేస్తున్న వైసీపీ నేతలు (ఫైల్)

గన్నవరం మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణలతో బుడమేరు కుచించుకుపోయింది. పెదపారుపూడి, నందివాడ, బాపులపాడు, ఏలూరుజిల్లా పెదపాడు మండలాల్లో రాజకీయ నాయకులు బుడమేరు పరీవాహక ప్రాంతాల్లో అడ్డగోలుగా ఆక్రమించుకుని చేపల, రొయ్యల చెరువులను తవ్వేశారు. ముఖ్యంగా బాపులపాడు మండలంలోని కురిపిరాల, ఓగిరాల, పెదపాడు మండలంలోని కొణికి, ఒడ్డిగూడెం, నందివాడ మండలంలోని పుట్టగుంట, కుదరవల్లి, అరిపిరాల, లక్ష్మీనరసింహాపురం, ఇలపర్రు ప్రాంతాల్లో బుడమేరులో ఆక్రమణలు వందలాది ఎకరాల్లో ఉన్నాయి.

> గతేడాది సెప్టెంబరులో బుడమేరు వరద బీభత్సం ఇంకా కళ్లముందు కదలాడుతూనే ఉంది. విజయవాడ నగరం అతలాకుతలమై.. ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటే.. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ముంపుప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలిచారు. బుడమేరు వరదకు కాల్వలకు గండ్లుపడి వేలాది ఎకరాల్లో పంట, ఆస్తి నష్టం సంభవించింది. నివాస ప్రాంతాల్లో రోజుల తరబడి నీరు బయటకు వెళ్లక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అంతటి విపత్తును మిగిల్చిన బుడమేరు వరదకు కారణం ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆక్రమణలకు గురికావడమే.. ఈ నేపథ్యంలో బుడమేరు ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజకీయ ఒత్తిడులను అధిగమించి అధికారులు ఎంతమేర ప్రగతి సాధిస్తారో వేచి చూడాల్సిందే..

● అధికారబలంతో యథేచ్ఛగా ఆక్రమణలు

గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్ నాగిరెడ్డి బాపులపాడు మండల పరిధిలో బుడమేరులో 50ఎకరాల్లో బుడమేరును ఆక్రమించారు. సుమారు 30 ఎకరాల్లో వెదురుబొంగుల తోట, సోదరుడి పేరుతో రెండు చేపలచెరువులు తవ్వేశారు. బుడమేరు ఆధునీకీకరణలో తవ్వకుండా వదిలేసిన ప్రాంతంలో నాగిరెడ్డి ఆక్రమణలకు పాల్పడినట్టు సమాచారం. బాపులపాడు మండల పరిధిలో బుడమేరు పరీవాహక ప్రాంతంలో గట్టు వెంబడి 10 ఎకరాల్లో పామాయిల్ తోటను టీడీపీ నేత సాగు చేస్తున్నారు. చేపల మేత


వ్యవసాయ కమిషన్ రాష్ట్ర వైస్‌చైర్మన్ నాగిరెడ్డికి చెందిన వెదురు బొంగుల తోట


ఫ్యాక్టరీ నిర్మించి రెండు చేపల చెరువులను తవ్వేసారు. పశ్చిమ గోదావరి జిల్లా. పెదపాడు మండలం కొణికి గ్రామ పరిధిలో బుడమేరు ప్రాంతాన్ని ఆక్రమించి 25ఎకరాల్లో రొయ్యల చెరువును సాగు చేస్తున్నారు.

● బుడమేరు గట్టును తవ్వేశారు..

నందివాడ మండలం పుట్టగుంట సర్పంచ్ తెన్నేటి విజయభాస్కరరెడ్డి వైసీపీ ప్రభుత్వ హయాంలో బుడమేరు గట్టును తవ్వేసి మట్టిని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. నందివాడ మండలం చేదుర్తిపాడు, గన్నవరం మండలం కొయ్యగూరపాడు గ్రామాల మధ్య యథేచ్ఛగా మట్టిని తవ్వేసుకుని వైసీపీ నాయకులు అమ్మేసుకున్నారు. నందివాడ మండలం అరిపిరాల సప్టా సమీపంలో గట్టు బుడమేరులోకి జారిపోయింది. బుడమేరుకు మళ్లీ వరదలు వస్తే గట్టు తెగి ఊళ్లను ముంచేసే ప్రమాదం ఉంది.

● రెవెన్యూ లీలలు

రెవెన్యూ వర్గాల లీలలు దీనికి భిన్నంగా ఉన్నాయి. బుడమేరు ఆధునీకీకరణలో ఆక్రమణలో ఉన్న, పట్టా భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించి ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టకుండా అలసత్వం వహించారు. దీంతో ఆక్రమణదారులు అందిన కాడికి మట్టి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. కొందరైతే ఏకంగా చెరువులు తవ్వేసి లీజులకు ఇచ్చారు.


బుడమేరు పరివాహక ప్రాంతంలో నిర్మించిన ఫ్యాక్టరీ

● పూర్తిస్థాయి ప్రక్షాళన సాధ్యమేనా..?

రాజకీయ నాయకుల ప్రమేయం లేకపోతే బుడమేరు ప్రక్షాళన సాఫీగా సాగుతుందని అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. పలుకుబడిని ఉపయోగించి ఒక చోట చేయాల్సిన పనులను మరోచోటకు మళ్లించి పక్కదారి పట్టించిన దాఖలాలున్నాయి. బుడమేరులో ఆక్రమణలను పూర్తిస్థాయిలో గుర్తించి, రాజకీయ ఒత్తిడులకు తలొగ్గకుండా చర్యలు చేపట్టాలని పేర్కొంటున్నారు. శనివారం విజయవాడలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశంలో బుడమేరు ప్రక్షాళన దిశగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయనున్నారు. రెవెన్యూ, డ్రెయినేజీ అధికారులు ఆక్రమణల గుర్తింపులో పారదర్శకత పాటిస్తారో, ఎంత మేరకు ప్రభుత్వానికి సహకరిస్తారో వేచి చూడాలి.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగుల కోసం గ్రీవెన్స్

- ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహణ

మచిలీపట్నం, జనవరి17(ఆంధ్రజ్యోతి): డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శుకవారం ఉద్యోగుల కోసం ప్రత్యేకగ్రీవెన్స్‌ను నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. కాంటింజెంట్ పద్ధతిలో పీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు నెలనెలా ఇవ్వడంలేదని, సక్రమంగా ఇప్పించాలని కోరుతూ నలుగురు ఉద్యోగులు అర్జీలు అందజేశారు. పామర్రు పీహెచ్‌సీలో వైద్యాధికారి అనుమతులతో మరమ్మతు పనులు చేయించినా, బిల్లుల మంజూరుచేయడం లేదని, బిల్లులు మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని పామర్రు పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఉద్యోగి అర్జీ అందజేశారు. మరో ఉద్యోగి పీహెచ్‌సీలకు కేటాయించిన నిదులను సక్రమంగా వినియోగించకపోవడంతో నిధులు వెనుదిరిగి పోతున్నాయని, ఇకనుంచయినా నిధులను సకాలంలో ఖర్చుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, ప్రతినెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు గ్రీవెన్స్‌ను నిర్వహిస్తామని శర్మిష్ట తెలిపారు.


మచిలీపట్నంలో ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో శర్మిష్ట

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో
షార్ట్‌టర్మ్ కోర్సులకు దరఖాస్తులు

భారతీనగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వల్ప కాలిక వ్యవధి కోర్సుల శిక్షణకు 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయసారథి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలోని స్కిల్ సెంటర్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు మూడు నెలల శిక్షణ ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నూతన సాంకేతికతతో కూడిన పరిజ్ఞానం తో ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. 8, 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమో, అపైన అర్హతున్న అభ్యర్థులుదరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తిగలవారు 9985759304, 83282 52829లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ విజయసారథి తెలిపారు.

నేడు నవోదయ పరీక్షలు

మచిలీపట్నం టౌన్ : వేలేరు నవోదయలో 6వ తరగతిలో అడ్మిషన్లకుగాను శనివారం 12 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈవో రామారావు తెలిపారు. ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మచిలీపట్నం నిర్మలా స్కూల్‌లో 230, బాలాజీ విద్యాలయంలో 240, అవనిగడ్డలో 273, బంటుమిల్లిలో 239, గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో 288, గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో 263, గుడివాడలో 317, ఈడుపుగల్లులో 312, పునాదిపాడులో 303, మొవ్వలో 221, పామర్రులో 140, ఉయ్యూరులో 297 మంది పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనపై దృష్టిపెట్టండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యంగా సుస్థిరాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. లక్ష్యాల సాధనకు చేపట్టిన చర్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, డ్వామా, కో-ఆపరేటివ్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతాంగం అభివృద్ధి చెందితే మిగిలిన రంగాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం వుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు సిబ్బంది బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సందేహాల నివృత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 131 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు వుండగా కేవలం 69 సంఘాలను మాత్రమే ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తున్నాయని మిగిలిన వాటిలో విక్రయాలు నిర్వహించి రైతులకు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి, మినుము, మొక్కజొన్న వంటి విత్తనాలు సిద్ధంగా వుంచాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధ్వర్యంలో ఉపాధి పథకం కింద జిల్లాలో 475 మినీ గోకులాల షెడ్ల నిర్మాణం లక్ష్యం కాగా 523 నిర్మాణాలను చేపట్టి 335 నిర్మాణాలను పూర్తి చేయడం అభినందనీయమని రైతులు కోరిన చోట షెడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టి రైతులకు పశుగ్రాసాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీకుమార్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి దివాకర్ బాబు, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి కె.నాగమల్లిక, జిల్లా మార్కెటింగ్ అధికారి మంగమ్మ తదితరులున్నారు.

రేషన్ డీలర్ల తుది ఎంపిక జాబితా విడుదల

మొగల్రాజపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఆర్డీవో కార్యాలయ పరిధిలో ఉన్న విజయవాడ, జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్ జారీచేసి పరిక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు పూర్తి చేసి జాబితాను కార్యాలయంలో ఉంచినట్టు ఆర్డీవో కావూరి చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 111 షాపులకు నోటిఫికేషన్ ఇవ్వగా 7 షాపులపై హైకోర్టులో కేసులున్నందున, 7 షాపులకు దరఖాస్తులు రానందున మొత్తం 14 షాపులను నోటిఫికేషన్ నుంచి మినహాయించినట్టు తెలిపారు. దరఖాస్తులురాని షాపులకు మరోసారి నోటిఫికేషన్ జారీ చేస్తామని, కోర్టు దావాలో ఉన్న 7 షాపులకు కోర్టు ఆదేశాలను అనుసరించి తదుపరి చర్యలు తీసుకుటామని ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెల్లడించిన రేషన్ దుకాణాలకు సంబంధించి అభ్యంతరాలు ఉన్నయెడల 25వ తేదీలోగా లిఖిత పూర్వకంగా కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

ప్రతి ఇంటా సౌర వెలుగులు లక్ష్యం

- సూర్యఘర్ కనెక్షన్ల మంజూరులో జిల్లాను అగ్రగామిగా నిలపాలి
- రెండు లక్షల గృహాలకు రిజిస్ట్రేషన్‌లను వారంలోగా పూర్తిచేయండి
- లక్ష్య సాధనలో పొదుపు సంఘాల మహిళల భాగస్వామ్యం కీలకం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతి ఇంటా 'సూర్యఘర్' వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో రెండు లక్షల సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వారంలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి 'సూర్యఘర్' పథకం ద్వారా సౌర విద్యుత్ కనెక్షన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల గృహాలకు సౌర విద్యుత్ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు 45 వేలమంది సౌర విద్యుత్ కనెక్షన్లకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో 35 వేలు గ్రామీణ ప్రాంతంలో, 10 వేలు పట్టణ ప్రాంతంలో ఉన్నాయన్నారు. పట్టణ ప్రాంతాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అధిక రాయితీనిచ్చి తక్కువ పెట్టుబడితో ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చునన్న విషయాన్ని ప్రజలకు వివరించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్ కొరకు ఓసీ, బీసీ వర్గాలకు చెందిన స్వయం సహాయక బృందాలు రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూ.20 వేలు లబ్దిదారు వాటాపోను మిగిలిన మొత్తాన్ని తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణంగా మంజూరు చేసేందుకు సిద్ధంగా వున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి పూర్తి రాయితీతో సౌర విద్యుత్ కనెక్షన్ పొందే అవకాశం వుందన్నారు. లక్ష్య సాధనలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వామ్యం కీలకమన్నారు. వారంరోజుల లోపు లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగపరంగా అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా వున్నామన్నారు. సొంత ఇల్లు వుండి, కరెంటు కనెక్షన్ ఉన్న వారెవరైనా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎంసూర్యఘర్.జీఓవీ.ఇన్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, సమీప సచివాలయం లేదా విద్యుత్ కార్యాలయం వంటి వాటిని సంప్రదించి కూడా వారి సహాయంతో రిజిస్ట్రేషన్ చేసుకొనేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, జిల్లాకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్, విద్యుత్‌శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌తో పరిసరాల పరిశుభ్రత

కృష్ణలంక : ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా జిల్లాను పచ్చదనం పరిశుభ్రతలో అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. శుక్రవారం వీడియా కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌గా పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తానని ప్రతిజ్ఞ తీసుకొని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమాలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా గ్రామ, మండల పంచాయితీ స్థాయి అధికారులు తొలగించిన చెత్త రవాణాకు వాహనాలు, యంత్రాలు దాతల సహకారంతో సమకూర్చుకొనేలా కృషి చేయాలన్నారు. అవసరమైతే మండలంలోని ఇతర గ్రామ పంచాయితీలకు చెందిన పారిశుధ్య సిబ్బందిని చెత్తకుప్పల తొలగింపు కోసం వినియోగించుకోవాలన్నారు. పారిశుధ్య పని ప్రారంభించే ముందు, చెత్తను తొలగించిన అనంతరం ఫొటోలు తీసి జిల్లా అధికారులకు పంపాలని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహ, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీవో లావణ్య, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డ్వామా పీడీ ఎ.రాము, డీఎస్‌వో పాపారావు, మున్సిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

మిగులు ధాన్యం.. మిల్లర్ల భోజ్యం!

సమర్థవంతంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన కూటమి ప్రభుత్వం స్వల్ప విరామం తీసుకోవడంతో వ్యాపారులు అన్నదాతను దోచుకోవడం ప్రారంభించారు. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో పలు చోట్ల కల్లాల్లోనే పెద్ద మొత్తంలో ధాన్యం నిల్వలు ఉండటంతో వచ్చినకాడికి మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కక రైతున్నలు దళారుల చేతిలో మోసపోతూనే ఉన్నారు.

- కొనుగోళ్ల విరామంతో నష్టపోతున్న రైతులు
- డివిజన్‌లో ఇంకా కల్లాలోనే ధాన్యం నిల్వలు
- దిక్కుతోచని స్థితిలో దళారులకు విక్రయం
- త్వరలో కొనుగోళ్లు చేపడతాం : ఆర్డీవో

(ఆంధ్రజ్యోతి-నందిగామ) : ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. క్వింటాకు రూ.2,320 మద్దతు ధర అందించి భారీగా కొనుగోళ్లు చేసింది. అధికారుల నిరంతర పర్యవేక్షణలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు చేపట్టింది. రెండురోజుల వ్యవధిలోనే రైతులకు సొమ్ములు చెల్లించింది. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 19500 టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. లక్ష్యాల మేర కొనుగోళ్లు పూర్తిచేసిన ప్రభుత్వం ఇటీవల సేకరణ నిలిపివేసింది. ప్రభుత్వం అన్నదాతకు మద్దతు ధర అందిస్తుండటంతో దోచుకోవడం సాధ్యం కాక వ్యాపారులు మిన్నకుండిపోయారు. అదను కోసం ఉన్న వ్యాపారులకు ప్రభుత్వ కొనుగోళ్లు నిలిపివేయడం కలసి వచ్చింది. పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకొనే అవకాశం లేక పోవడంతో పాటు మసుగు వాతావరణంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతుల ఇబ్బందులను సొమ్ము చేసుకొనేందుకు వ్యాపారులు క్వింటాకు రూ.300 నుంచి రూ.400 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల అన్నదాతలకు భారీ నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం కొనుగోళ్లు నిలిపివేయడంతో దిక్కుతోచని స్థితిలో దళారులకు బలవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం.. నందిగామ డివిజన్‌లో సుమారు ఐదువేల టన్నులకు పైగా ధాన్యం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఇందులో కొంతమేర ఇప్పటికే కల్లాలో ఉండగా, మిగిలిన ధాన్యం నూర్పిళ్లు జరపాల్సి ఉంది. ధాన్యం నిల్వలు రైతుల వద్ద ఉన్నందున ప్రభుత్వం మరికొంత కాలం కొనుగోళ్లు కొనసాగించాలని కోరుతున్నారు.


కల్లాలో నిల్వ ఉంచిన ధాన్యం

ధాన్యం కొనుగోళ్లు చేపడతాం..

\- ఆర్డీవో కె.బాలకృష్ణ

రైతుల వద్ద ఉన్న పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. డివిజన్‌లోని రైతుల ఇబ్బందులపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడగా.. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మరో ఏడువేల టన్నుల కొనుగోలుకు అంగీకరించారు. ఆన్‌లైన్ ఓపెన్ కాగానే కొనుగోళ్లు ప్రారంభిస్తాం. రైతులు ఎవరూ తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు. నందిగామ డివిజన్‌లో పూర్తి ధాన్యం కొనుగోలు చేపట్టే అవకాశం ఉంది.


రోడ్డు ప్రమాద బాధితులను కారులో ఆసుపత్రికి తరలిస్తున్న మంత్రి పార్థసారథి

మానవత్వం చాటుకున్న మంత్రి సారథి

పామర్రు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై కనుమూరు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో అకురాతి కాంతారావు(36), అకురాతి శ్రీనివాసరావులు(30)లు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. అదే సమయంలో స్వగ్రామం నుంచి అమరావతిలో కేబినెట్ సమావేశానికి వెళుతున్న మంత్రి కొలుసు పార్థసారథి తన కాన్వాయని నిలుపుదల చేసి క్షతగాత్రులను ఉయ్యూరు ఆసుపత్రికి కారులో తరలించి మానవత్వం చాటుకున్నారు. మంత్రి వేరే కారులో అమరావతికి వెళ్లారు.

తల్లిని దూరం చేశాడనే హత్య?

- నిందితుడి కోసం గాలింపు

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట) : తన తల్లితో అక్రమ సంబంధం పెట్టుకోవడమే కాకుండా, కనీసం తల్లిని చూసేందుకు కూడా అంగీకరించకపోవటంతోనే దివ్యాంగుడు యర్రంశెట్టి ఆంజనేయులును నిందితుడు నరేష్ హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఆంజనేయులు అడ్డు తొలగిస్తే తప్ప తమ కుటుంబం కలిసి జీవించే అవకాశం లేదనే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు తెలుస్తోంది. గురువారం రాత్రి 9 గంటల సమయంలో దివ్యాంగుడు, పురపాలకసంఘ కాంట్రాక్టు కార్మికుడు యర్రంశెట్టి ఆంజనేయులును బి.సురేష్ కమ్మకొడవలితో నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. రైతు బజార్‌లో కోడిగుడ్ల కౌంటర్ పెట్టిన సమయంలో నరేష్ తల్లితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత నరేశ్ కుటుంబం కకావికలైంది. దీంతో ఆంజనేయులుపై కక్ష పెంచుకున్న నరేష్ అతడి అడ్డు తొలగించుకోవాలని హత్యకు పథకం రచించాడు. గురువారం రాత్రి తల్లి వద్దకు వచ్చిన ఆంజనేయులుతో నరేష్‌కు ఘర్షణ జరిగింది. బైక్‌పై ఆంజనేయులును వెంబడించి కత్తితో దాడి చేసి పరారైయ్యాడు. పోలీసులు నరేష్ కోసం గాలిస్తున్నారు. శుక్రవారం ఆంజనేయులు భౌతికకాయానికి పోస్టుమార్టమ్ అనంతరం బంధువులకు అప్పగించారు. త్వరలోనే కేసులో మిస్టరీని చేదిస్తామని జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.500

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు జీవన భృతి కల్పించాలి

అవనిగడ్డ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు జీవన భృతిని కల్పించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నేత మండలి వెంకట కృష్ణారావు కోరారు. విజయవాడలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును శుక్రవారం కలసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణారావు మాట్లాడుతూ, సూపర్ లగ్జరీ, గరుడ, ఇంద్ర సర్వీస్‌లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఇన్‌చార్జి
ఏపీసీగా ఫణిధూర్జటి



బాధ్యతలు స్వీకరించిన ఎం. ఫణిధూర్జటి

మచిలీపట్నం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష ఇన్‌చార్జి ఏపీసీగా ముదిగొండ ఫణిధూర్జటిని కలెక్టర్ బాలాజీ నియమించారు. ప్రస్తుతం పనిచేస్తున్న కె. రాములు నాయక్‌ను కేఆర్ పురం ఐటీడీఏ పీవోగా బదిలీ అయ్యారు.

విస్తరణ జరిగేనా!

● కోనేరు సెంటర్ నుంచి గంగానమ్మ గుడి వరకు పోర్టు రోడ్డులో తొలగించని ఆక్రమణలు
● ట్రాఫిక్‌కు అడ్డంగా విద్యుత్ స్తంభాలు
● ఇబ్బంది పడుతున్న స్థానికులు



పోర్టు రోడ్డులో రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కోనేరుసెంటర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు విస్తరణ పూర్తి కాలేదు. కోనేరుసెంటర్ నుంచి గంగానమ్మ గుడి వరకు మార్జిన్లలోని ఆక్రమణలు తొలగించలేదు. ఆసుపత్రుల వద్ద విద్యుత్ స్తంభాలు అలాగే ఉండి పోయాయి. దీంతో ప్రైవేటు వ్యక్తులు రోడ్డు పక్కన తమ వాహనాలను పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అలాగే విద్యుత్ శాఖ, నగర పాలక సంస్థలు విద్యుత్ స్తంభాలను రోడ్డు మార్జిన్‌కు జరిపే కార్యక్రమం చేపట్టడం లేదు. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పెషల్ డ్రైవ్

అవనిగడ్డ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే 40 వేల సభ్యత్వాలకు దగ్గరగా ఉండటంతో పార్టీ కార్యాలయంలో స్పెషల్ సెల్ ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ ఆధ్వర్యంలో మిగిలిపోయిన వారి వివరాలు తీసుకుని స్వచ్ఛందంగా సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకునే ఏర్పాట్లు చేశారు. కోడూరు మండలానికి చెందిన పార్టీ సభ్యత్వాలను పూర్తి చేయగా, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు బండే శ్రీనివాసరావు, యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, రావి రత్నగిరి, గోగినేని సోమశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో పెన్షన్‌దారు నుంచి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు, ఈవో

చల్లపల్లి మండలంలో పెన్షన్ల తనిఖీ

చల్లపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం పెన్షన్ల తనిఖీ చేశారు. తొలివిడతలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుల పెన్షన్లను వైద్యఅధికారులు తనిఖీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులుగా, మంచానికే పరిమితమైన వీరు రూ.10వేలు, రూ.15వేల చొప్పున ఫించన్ పొందుతున్నారు. మండలంలో 40 మంది పెన్షన్‌దారులుండగా, మండల కేంద్రమైన చల్లపల్లిలో 12 మంది ఉన్నారు. చల్లపల్లి ఎంపీడీవో డాక్టర్ ఎ.వి.రమణ పర్యవేక్షణలో రెండు బృందాలుగా అధికారులు తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ప్రత్యేక యాప్‌లో వారి ఫొటోను తీసుకున్నారు. కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



గొడుగుపేటలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి

వైభవంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

మచిలీపట్నం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం గొడుగుపేటలో శుక్రవారం నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రముఖ హరికథకుడు మడమల రాంబాబు, కూనపరెడ్డి బ్రహ్మయ్య, సూరిశెట్టి హరికృష్ణ, విన్నకోట సుబ్బారావు, వడ్లమూడి చిన్నా, దుర్గాప్రసాద్, కుందా శర్మ, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మడమల రాంబాబు మాట్లాడుతూ, శ్రీకృష్ణదేవ రాయల ఆస్థానంలో కవులు, కళాకారులను పోషించారన్నారు.

నాగాయలంక : శ్రీకృష్ణ దేవరాయలు జయంతి పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం నేతృత్వంలో శుక్రవారం పర్రచివర, దిండి గ్రామాల్లో ఎస్టీలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భోగాది సోమశేఖర్, తోట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు బర్మా శ్రీనివాసరావు, విజయ్, మండలి బాజీ, ఎం.అక్షయ కుమార్, ఉయ్యూరు కృష్ణ, కారంకి కృష్ణ, గంగయ్య, కారంకి ప్రసాద్, పులి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు తోటమూలలో రక్తదాన శిబిరం

పెడన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం తోటమూలలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఈ మెగా రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు.

దివ్యాంగులకు రగ్గుల పంపిణీ

అవనిగడ్డ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలోని షాలోమ్ ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు విలియం కేరి ఆధ్వర్యంలో దివ్యాంగులకు రగ్గులను ఎస్సై శ్రీనివాస్ చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.75 వేలు విరాళం

మోపిదేవి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాతలు విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన బి.సందీప్ రూ.75,116 ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు. ఆలయ మర్యాదలతో దాతలను సత్కరించారు.



రిక్షాలను పారిశుధ్య కార్మికులకు అందజేసిన సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్

గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలి

అవనిగడ్డ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ అన్నారు. పులిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెండు నూతన రిక్షాలను శుక్రవారం సర్పంచ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, కార్యదర్శి అనిత్, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

చల్లపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నబీషోరి ఆధ్వర్యంలో సియోను వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు దిడ్ల కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పసుమర్తి జాకబ్, కార్యనిర్వాహక అధ్యక్షులు చావలి రూబెన్‌బాబు, జిల్లా అధ్యక్షుడు మట్టా ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

మచిలీపట్నం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ వృద్ధుడు గుండెపోటుతో మృతిచెందాడు. గూడూరు మండలం పిండివారిపాలెంకు చెందిన సిరివెళ్ల వెంకటేశ్వరరావు (70) ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. చెకప్ నిమిత్తం విజయవాడ వెళుతుండగా గుండెపోటుతో మృతి చెందాడు. బస్సులో ఉన్న వైద్యుడు సీఆర్‌పీసీ చేసినా ఫలితం దక్కలేదు.

ఒకే డోర్ నెంబర్‌కు 4 ఇంటి పన్నులపై నిరసన

మచిలీపట్నం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరం మాచవరంలో సచివాలయం ముందు సాంబశివరావు అనే వ్యక్తి ధర్నాకు దిగారు. ఒకే డోర్ నెంబర్ గల తన ఇంటికి నాలుగు ఇంటి పన్నుల డిమాండ్లు పంపారని శుక్రవారం నిరసనకు దిగాడు. 72 గజాల స్థలాన్ని ఏవీవీ సాంబశివరావు కొనుగోలు చేసి తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఒక ఇంటిని నిర్మించారు. గతంలో తన పేరుపై విధిస్తున్న ఇంటి పన్నుకు మరో రెండు పన్నులు జోడించి డిమాండ్ నోటీసులు ఇచ్చారని సాంబశివరావు వాపోయాడు.

ఎదురుమొండి - గొల్లమంద
రహదారి నిర్మాణానికి నిధులు

అవనిగడ్డ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సముద్రపు ఆటుపోట్ల కారణంగా కోతకు గురై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన ఎదురుమొండి - గొల్లమంద రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.13.45 కోట్లు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఇటీవల వచ్చిన కృష్ణానది వరదల కారణంగా ఆ రహదారి పూర్తిగా నదీపాతానికి గురికాగా, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ బాలాజీతో కలసి ఆ రహదారిని పరిశీలించటంతోపాటు సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకు తెలియజేసి రూ.13.45 కోట్లు మంజూరు చేయించారని బుద్ధప్రసాద్ తెలిపారు. ఈ నిధులతో ఎదురుమొండి నుంచి బ్రహ్మయ్యగారి మూల మీదుగా గొల్లమంద వరకు కరకట్టను బలోపేతం చేయటంతోపాటు కోత నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని రహదారి నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

20 నుంచి పశువుల ఆరోగ్య శిబిరాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పశువులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు జిల్లాలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎన్.సి.హెచ్. నరసింహులు తెలిపారు. గుడ్లవల్లేరు డివిజన్‌లో 248, మచిలీపట్నం 175 పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నట్టల నివారణకు పశువులకు మందులు వేస్తారన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు మందులు సరఫరా చేశామని, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారం రోజుల పాటు పశు బీమా పథకం, పశుకిసాన్ క్రెడిట్ కార్డులు, పిండిమార్పిడి పరిజ్ఞానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



ప్లానింగ్ సెక్రటరీలతో ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న టీపీఓ సుజనకుమారి

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం

పెడన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణాలకు, లే అవుట్లకు అనుమతులు ఇచ్చే అధికారం ప్రభుత్వం మునిసిపాలిటీలకు అప్పగించిందని పట్టణ ప్రణాళికాధికారిణి సుజనకుమారి అన్నారు. ఈ మేరకు జీవో కూడా జారీ చేసిందన్నారు. మునిసిపల్ కార్యాలయంలో ప్లానింగ్ సెక్రటరీలతో ఆమె శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చే అధికారం మునిసిపాలిటీలకు అప్పగించినందున మునిసిపాలిటీల ఆదాయం పెరగడంతోపాటు భవన నిర్మాణాలకు, లే అవుట్లకు అనుమతులు రావడం సులభమవుతుందన్నారు. ఇరుకురోడ్లను వెడల్పు చేయడానికి ఉన్న అవకాశాలను ప్లానింగ్ సెక్రటరీలు పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధాన రహదారిపై ఆక్రమణలను గుర్తించి రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను రూపొందించాలన్నారు. భవన నిర్మాణాలు, లే అవుట్లపై ప్లానింగ్ సెక్రటరీల నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్ పాల్గొన్నారు.



చంద్రశేఖరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు

చంద్రశేఖరరావు సేవలు ఆదర్శనీయం

ఘంటసాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గొర్రెపాటి విద్యా ట్రస్ట్ కోశాధికారి గొర్రెపాటి చంద్రశేఖరరావు సేవలు ఆదర్శనీయులని ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్ బాబు - ఇందిరా దంపతులు అన్నారు. ఘంటసాలలో చంద్రశేఖరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎన్ఆర్ఐ రంగనాథ్ బాబు దంపతులతోపాటు పలువురు నివాళులర్పించారు. గొర్రెపాటి వెంకట రామకృష్ణ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ రంగనాథ్ బాబు సహకారంతో చంద్రశేఖరరావు గత 30 సంవత్సరాల నుంచి పని చేస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. ఎన్ఆర్ఐ వేమూరి రాజేష్, చల్లపల్లి విజయా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, ఘంటసాల యూవీఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు, మచిలీపట్నం విశ్రాంత జనరల్ మేనేజర్ డిఎస్ఆర్‌కె.ప్రసాద్, బండి పరాత్పరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బంటుమిల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.గోవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.









వైభవోపేతంగా శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా శుక్రవారం శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఈ హోమంలో 90మంది దంపతులు పాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చికిత్స పొందుతూ యువకుడు మృతి



తోట్లవల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ టి సాగర్(22) అనే యువకుడు శుక్రవారం మృతి చెందాడని ఎస్సై ఎం అర్జునరాజు తెలిపారు. ఈ నెల 15న గుంటూరుజిల్లా తాడేపల్లి వద్ద మహానాడుకు చెందిన సాగర్, మధుసూదనరెడ్డి గొడవర్రులో కోడిపందేలకు వస్తూ రొయ్యూరు వద్ద రోడ్డుప్రమాదానికి గురై తీవ్ర గాయాలకు గురయ్యారని తెలిపారు. సాగర్ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మాకు న్యాయం చేయండి

● జిల్లా ఉద్యానాధికారిణి జ్యోతికి రైతుల విజ్ఞప్తి

తోట్లవల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరులో సంభవించిన కృష్ణానది వరదలకు పంటలు కోల్పోయిన మాకు పరిహారం అందలేదని జిల్లా ఉద్యానాధికారిణి జ్యోతికి వరద బాధిత రైతులు మొరపెట్టుకున్నారు. తోట్లవల్లూరు వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం పంటల నష్టం అక్రమాలపై జ్యోతి విచారణకు వచ్చారు. దీంతో అనేకమంది ఉద్యాన పంటల రైతులు వచ్చి తమ ఆవేదనను తెలియజేశారు. పసుపు, అరటి, కంద పంటలను వరదకు కోల్పోయి లక్షలాది రూపాయలను నష్టపోయామని, రైతు సేవా కేంద్రాల్లో వీఏఎలకు పూర్తి వివరాలు అందించామని, అయినప్పటికీ ఒక్క రూపాయి పరిహారం రాలేదని, మరోవైపు అనర్హులకు పరిహారం జమయిందని రైతులు లంక అశోక్ కుమార్, బోలెం శ్రీనివాసరావు తదితర రైతులు చెప్పారు. 131-1 పాత సర్వే నెంబరుపై 68 మంది రైతులకు అక్రమంగా పరిహారం ఎలా ఇచ్చారని సదరు రైతులు ప్రశ్నించారు. ఈ మేరకు పంటలు సాగుచేయకుండా పరిహారం పొందిన 68 మంది పేర్ల జాబితాను ఉద్యానాధికారి జ్యోతికి లిఖిత పూర్వకంగా అందించారు. గతంలో 40 మంది నిజమైన బాధిత రైతుల పేర్లను అధికారులకు అందించామని, తమందరికి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



జిల్లా ఉద్యానాధికారి జ్యోతికి వివరాలు తెలుపుతున్న రైతులు

మినుములో పల్లాకు తెగులు నిర్మూలనకు సస్యరక్షణ చర్యలు : డీడీఏ



బేతవోలులో మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జ్యోతిర్మయి

గుడివాడ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మినుము పంటలో పల్లాకు తెగులు రాకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీఏ) కె.జ్యోతిర్మయి అన్నారు. శుక్రవారం బేతవోలు తదితర ప్రాంతాల్లో మినుము పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పల్లాకు తెగులు నిర్మూలనకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ రైతు కలుపు నివారణ చర్యలు ముందుగా తీసుకుని కూలీల చేత కలుపు తీయించాలని కోరారు. ప్రతీ రైతు ప్రతీ రోజు మినుము పైరు పొలంలో తిరిగి ఆకుల్లో ఎటువంటి తెగుళ్లు ఉన్నా వెంటనే పరిశీలించి సంబంధిత వ్యవసాయ శాఖాధికారులకు తెలియజేయాలని కోరారు. రైతులు ముకుమ్మడిగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఏవో బి.అనంతలక్ష్మి, ఏఈవోలు డి.అనూష, వి.అనిత, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

7 గంటల కరెంటుపై రైతుల ఆందోళన

తోట్లవల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గత పది రోజులుగా వ్యవసాయానికి ఇస్తున్న కరెంటుపై కోతలు విధిస్తుండటంపై శుక్రవారం తోడేళ్లదిబ్బలంక, వల్లూరుపాలెం రైతులు తోట్లవల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తొమ్మిది గంటల వ్యవసాయ విద్యుత్ ఇస్తుండగా మండలంలో 7 గంటలు మాత్రమే ఎందుకు ఇస్తున్నారని విద్యుత్ ఏఈ దేవదాసుని ప్రశ్నించారు. 7 గంటల కరెంటుతో మొక్కజొన్న, చెరకు, అరటి, మినుము, కూరగాయల తోటలకు నీరు అందక వాడిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానది వరదలకు పంటలు కోల్పోయి తీవ్ర నష్టాల్లో ఉండి మళ్లీ అప్పులతో ఇతర పంటలు సాగుచేస్తుంటే కరెంటు కోతలేమిటని రైతులు మండిపడ్డారు. తమకు సమాధానం చెప్పాలని, 9 గంటల కరెంటు ఇవ్వాల్సిందేనని రైతులు ఏఈ దేవదాసుని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఈకి వినతి పత్రం అందించారు. విద్యుత్ లైన్ మరమ్మతుల వల్ల వ్యవసాయానికి కరెంటు సరఫరా తగ్గిందని, ఉన్నతాధికారులకు తెలిపి తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ దేవదాసు రైతులకు వివరించారు.



ఏఈ దేవాదాసుకు వినతిపత్రం అందిస్తున్న లంక రైతులు

దేవస్థానం అధికారులపై లోకాయుక్తకు ఫిర్యాదు

తోట్లవల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రొయ్యూరు శ్రీసకేలశ్వరస్వామి దేవస్థానం అధికారులపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్టు రొయ్యూరుకు చెందిన బీసీ నాయకుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. దేవస్థానానికి చెందిన ఇత్తడి మాయంపైన, ఇతర అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గతేడాది సెప్టెంబరులో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయితే ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఫిర్యాది దారునైన తనను అప్రదిష్టపాల్జేసేందుకు కుట్ర జరిగిందన్నారు. దేవస్థానం కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నట్టుగా ఎస్సై అర్జునరాజు దేవదాయ శాఖ అధికారులకు పంపారని, దీంతో అక్రమంగా చందాలు వసూలు చేసినట్టు తనపైనే నింద మోపేందుకు కుట్ర జరిగిందన్నారు. దీంతో పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలని లోకాయుక్తకు ఫిర్యాదు చేశానని వెంకట శ్రీనివాసరావు తెలిపారు.

నేడు, రేపు ఐలూరు వద్ద కరకట్టపై ట్రాఫిక్ మళ్లింపు

తోట్లవల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఐలూరు వద్ద కరకట్టపై వాటర్ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 18, 19 తేదీల్లో ట్రాఫిక్ మళ్లింపు జరుగుతుందని ఎస్సై ఎం అర్జునరాజు శుక్రవారం తెలిపారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలు ఐలూరు వంతెన దిగి ఐనపూరు వద్ద కరకట్ట ఎక్కాలని, అవనిగడ్డ వైపు నుంచి వచ్చే వాహనాలు ఐనపూరు వద్ద దిగి ఐలూరులో ఎక్కాలని తెలిపారు.

చల్లపల్లి మండలంలో పెన్షన్ల తనిఖీ

చల్లపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం పెన్షన్ల తనిఖీ చేశారు. తొలివిడతలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుల పెన్షన్లను వైద్యఅధికారులు తనిఖీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులుగా, మంచానికే పరిమితమైన వీరు రూ.10వేలు, రూ.15వేల చొప్పున పింఛన్ పొందుతున్నారు. మండలంలో 40 మంది పెన్షన్‌దారులుండగా, మండల కేంద్రమైన చల్లపల్లిలో 12 మంది ఉన్నారు. చల్లపల్లి ఎంపీడీవో డాక్టర్ ఎ.వి.రమణ పర్యవేక్షణలో రెండు బృందాలుగా అధికారులు తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ప్రత్యేక యాప్‌లో వారి ఫొటోను తీసుకున్నారు. కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

● ఎమ్మెల్యే వెనిగండ్ల



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : శ్రీకోదండరామయ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో 80వ వార్షిక ధనుర్మాసోత్సవాలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం శాంతి నిమిత్తం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ దానాలోకెల్లా అన్నదానం గొప్పదన్నారు. గత 80ఏళ్లుగా దేవస్థానం ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని, అటువంటి కార్యక్రమంలో తాను పాల్గొనడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు డొక్కు రాంబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ లంక దాసరి ప్రసాదరావు, నాయకులు కడియాల గణేష్, చేకూరు జగన్మోహనరావు, సయ్యద్ గఫార్, చంటి, దేవస్థాన కమిటీ సభ్యులు దారపురెడ్డి వెంకన్న, మెరుగుమాల రామకృష్ణ, రాయపురెడ్డి రాజేంద్రప్రసాద్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి పశువుల ఆరోగ్య శిబిరాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పశువులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు జిల్లాలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎన్.సి.హెచ్. నరసింహులు తెలిపారు. గుడ్లవల్లేరు డివిజన్‌లో 248, మచిలీపట్నం 175 పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నట్టల నివారణకు పశువులకు మందులు వేస్తారన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు మందులు సరఫరా చేశామని, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారం రోజుల పాటు పశు బీమా పథకం, పశుకిసాన్ క్రెడిట్ కార్డులు, పిండమార్పిడి పరిజ్ఞానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

తోట్లవల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మనిషి ఆరోగ్యానికి, ఆనందానికి, జ్ఞానానికి, ఆర్థిక అభివృద్ధికి, ప్రపంచ శాంతికి ధ్యానం ఒక్కటే మూలమని నేషనల్ వెజిటేరియన్ మూమెంట్ అధ్యక్షులు, కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ అడిషనల్ ట్రస్టీ వల్లూరు శివనాగకృష్ణ పేర్కొన్నారు. బొడ్డపాడు గ్రామ సచివాలయం వద్ద దాతల సహకారంతో రూ.3 లక్షలతో చేపట్టిన పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్మాణానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ మూడే శివశంకర్‌తో కలిసి శివనాగకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శివనాగకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాఖాహారం తీసుకుంటూ పిరమిడ్ శక్తిని ఉపయోగించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె శివశంకర్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వీఆర్వో నాగేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు శీలం మధుబాబు, పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పేదల ఆకలి తీర్చడం కోసమే అన్నక్యాంటీన్లు

● అన్నక్యాంటీన్ నిర్మాణం కోసం స్థలం పరిశీలన

పామర్రు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పేదవాడి ఆకలి తీర్చడం కోసమే అన్న క్యాంటీన్ల ఏర్పాటు లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పామర్రు పట్టణంలో అన్న క్యాంటీన్ నూతన భవన నిర్మాణం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం వెనుక భాగంలో కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సొంత మండల కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను నిర్మించి నిరుపేదలకు చేరువ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం నిర్మాణం కోసం సంబంధిత అధికార్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల జిల్లా ప్రాజెక్టు వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, తహసీల్దార్ గూడపాటి రవికాంత్, ఎంపీడీవో కాంద్రుజ్యోతి, పీఆర్ఏఈ పి.రామారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌సలీం, పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పశువుల షెడ్ ప్రారంభం

గ్రామీణ ప్రాంతాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధికి పశుపోషకులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో కొమ్మున బోయిన హేమప్రకాష్ అనే పశు యాజమానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90శాతం రాయితీ రూ 2:30లక్షల నిధులతో మంజూరైన పశువుల షెడ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రావర్ల ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, ఎన్ఆర్‌జీ ఎస్ ఏపీవో సురేష్, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.